ప్రజాశక్తి
శనివారం 8 ఏప్రిల్ 2023





ఘనంగా గుడ్ ఫ్రైడే

జిల్లాలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు యేసు శిలువను ఊరేగించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. గుడ్ ఫ్రైడే ప్రముఖ్యతను ఫాదర్స్, పాస్టర్లు వివరించారు.

- ప్రజాశక్తి, బొబ్బిలి

లక్ష్యం తగ్గించుకున్నా.. సమయం పొడిగించుకున్నా.. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో సామూహిక గృహ ప్రవేశ ముహూర్తాలు దాటిపోతున్నాయి. తేదీల మార్పు ప్రహసనంగా మారాయి. లబ్ధిదారులకు ఇచ్చే మొత్తం పెంచకపోవడమే ఇందుకు కారణం. దీన్ని పక్కనబెట్టిన ప్రభుత్వం అధికారులకు టార్గెట్ విధిస్తోంది. అధికారులు లబ్ధిదారులపై ఒత్తిడి చేస్తున్నారు. అయినా అనుకున్న ప్రకారం నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.



లక్ష్యం తగ్గించినా.. సమయం పొడిగించినా..

- సామూహిక గృహ ప్రవేశాలకు తంటాలు
- అధికారులకు టార్గెట్లు
- లబ్ధిదారులపై ఒత్తిళ్లు
- అయినా పూర్తికాని గృహ నిర్మాణాలు
- ఈ నెలాఖరులో ముహూర్తాలకు సన్నాహాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం జిల్లాలో మొత్తం 77,205 ఇళ్ళు మంజూరు చేసింది. వీటిలో 651 లేఅవుట్లలో 36,631 ఇళ్లు, 40,574 వ్యక్తిగత ఇళ్లు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా పూర్తిచేసి గడిచిన సంక్రాంతి నాటికి సామూహిక గృహ ప్రవేశాలు చేపడతామని ప్రభుత్వం చెప్పింది. నిర్మాణాలు కొలిక్కిరాకపోవడంతో స్వరం మారింది. ఉగాదిని పురస్కరించుకుని మార్చి 22న జిల్లాలో 34,505 ఇళ్లలో గృహ ప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. జనవరి 26నాటికి కేవలం 18,320 ఇళ్లు పూర్తయ్యాయి. ఇక పూర్తికావాల్సినవి సుమారు 16,185 ఇళ్లు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో ఉగాది నాటికి గృహ ప్రవేశాలు తుస్సుమన్నాయి. ఈసారి ఏప్రిల్ 25 తరువాత ఏదో ఒక రోజు ప్రవేశాలు ఉంటాయంటూ గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఇలా సమయాన్ని పొడిగించడమే కాదు లక్ష్యాన్ని కూడా తగ్గించారు. తొలుత ఉగాది నాటికి 34,505 ఇళ్లను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఆ తరువాత 29,023 ఇళ్లకు కుదించారు. అయినా పూర్తికాలేదు. హౌసింగ్ డిఎం కథనం ప్రకారం వరకు 27,800 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వీటిలోనూ ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ప్లాస్టింగ్ వంటివి పెండింగ్‌లో ఉన్న ఇళ్లే ఎక్కువ. మిగిలిన 1200 ఇళ్లు మరో 18రోజుల్లో పూర్తికావాల్సివుంది. ఈ నేపథ్యంలో లక్ష్యానికి అనుగుణంగా గృహ నిర్మాణాలు చేపట్టడం ఈసారి అనుమానమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80లక్షలు ఏమూలలకూ సరిపోని పరిస్థితి ఉంది. ఇసుక, ఇనుము, సిమ్మెంటు, 13 రకాల సామగ్రి ప్రభుత్వం తరపున సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నా ఆచరణలో ఇసుక ధర ఆకాశాన్ని అంటుతోంది. మిగతా సామాగ్రి ధరలూ పెరిగిపోయాయి. ఇక పట్టణాలకు చాలా దూరంలో ఉండడం, నివాసయోగానికి అనుకూలంగా లేకపోవడం వంటి కారణాల వల్ల కొన్ని లేఅవుట్లలో ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఆర్థిక ఇబ్బందులూ వెంటాడుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ గుంకలాం వంటి పెద్ద లేఅవుట్లలో శివారు ప్రాంతాలకు విద్యుత్తు, నీటి, అప్రోచ్‌రోడ్లు సదుపాయాలు కల్పించలేదు. ఈ కారణంతో కూడా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు సాహసించడం లేదు.





సైనిక వాహనం వెంట బైక్‌లతో ర్యాలీగా సాగుతున్న యువత

అమర జవానుకు కన్నీటి వీడ్కోలు

ప్రమాదవశాత్తూ శిక్షణలో మృతిచెందిన మెరైన్ కమాండో చందక గోవింద్‌కు యువత, మండల ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. కిలోమీటర్ల మేర భారీ ర్యాలీగా సాగి అమర జవానుకు అశ్రునివాళులర్పించారు. సైనిక వాహనంలో గోవింద్ భౌతికకాయం చీపురుపల్లి మీదుగా స్వగ్రామం చేరుకుంది. అంతిమయాత్రలో వేల సంఖ్యలో యువత, అభిమానులు బైక్‌లతో ర్యాలీగా పాల్గొన్నారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గోవింద్ మరణంతో పర్ల గ్రామం దు:ఖసాగరంలో మునిగిపోయింది.

- ప్రజాశక్తి, గరివిడి



గోవింద్ తల్లిని ఓదార్చుతున్న మాజీ ఎంపి ఝాన్సీలక్ష్మి



అధికార లాంఛనాలతో నివాళులర్పిస్తున్న సైనికులు



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

విద్య ప్రయివేటీకరణతో

సామాజిక న్యాయానికి విఘాతం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం విద్యా రంగం బాధ్యత నుంచి తప్పుకొని ప్రైవేటీకరణ చేయడం వల్ల రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయానికి విఘాతం కలుగుతుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. విజయనగరం జిల్లా యుటిఎఫ్ ఆఫీసుబేరర్స్ సమావేశం జె. రమేష్ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన స్థానిక ఎన్‌పిఆర్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చే నాటికి అక్షరాస్యత 12శానికి మించిలేదన్నారు. సామాజికంగా అణిచివేత కు గురయ్యే కులాలు అభివృద్ధి చెందడానికి ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాలలో సమాన అవకాశాలు ఇవ్వాలని రాజ్యాంగంలో నిర్దేశించారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు ప్రభావం వల్ల ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని ప్రవేటీకరణకు పూనుకొంటుందని విమర్శించారు. ఎన్ఇపిలో భాగంగా విద్య వ్యాపారమయం అవుతుందన్నారు. ఇన్ఇపి అమలుతో సామాజిక న్యాయం ఉండదని ఆవేదన వ్యక్తంచేశారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణల పేరుతో 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేయడం వలన బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరం అవుతారని అన్నారు. కాబట్టి ఈ సంస్కరణలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎ.సత్యశ్రీనివాస్, సహాధ్యక్షులు వి ప్రసన్నకుమార్, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, పి.త్రినాథ, కేశవరావు, ఆర్‌ఎవి సూర్యారావు, పి.వాసు, సిహెచ్ తిరుపతి నాయుడు, జి.రాజారావు, వి.రాధాభవాని, బి.రామినాయుడు, ఎన్.సత్యనారాయణ, ఎ.శంకరరావు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌గా నాగలక్ష్మి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లా నూతన కలెక్టర్‌గా నాగలక్ష్మి సెల్వరాజన్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎ.సూర్యకుమారి పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2012వ ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన నాగలక్ష్మి ప్రస్తుతం అనంతపురం కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. 2021 జూన్ 11న అక్కడ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు విశాఖ కేంద్రంగా ఎపి ఇపిడిసిఎల్ సిఎండిగా సేవలందించారు. 2017 నుంచి 2019 వరకు సుమారు రెండేళ్ల మూడు నెలలపాటు ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. 2015 నుంచి 2017 వరకు గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఎపి ఇపిడిసిఎల్ పరిధిలో విజయనగరం కూడా ఉండడం వల్ల మన జిల్లాపై ఆమెకు కొంత వరకు అవగాహన ఉందని పలువురు భావిస్తున్నారు. సిఎండిగా పనిచేసిన కాలంలో ఎన్నికల పరిశీలకులుగా కూడా విజయనగరం జిల్లాలో పర్యటించారు. నాగలక్ష్మి సౌమ్యంగా ఉంటారని, సమస్యలను సున్నితంగా పరిష్కరిస్తారని, వివాద రహితంగా వ్యవహరిస్తారని ఆమెకు పేరుంది. గడిచిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా, వాటిని లెక్కచేయకుండా విధులు నిర్వహించారనే పేరుంది. ఇటీవలే ఈమె శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ నవీన్‌కుమార్‌ను వివాహం చేసుకున్నారు. బదిలీ అయిన సూర్యకుమారి పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ లేదా విద్యాశాఖ కమిషన్‌గా బదిలీ అవుతారని కొంతకాలంగా చర్చ జరిగిన విషయం విధితమే. పంచాయతీ రాజ్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.



సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పన



మన్యం జెసి సిరి

సీతంపేట ఐటిడిఎ పిఒ నవ్య ఇక్కడి నుంచి బదిలీ కాగా, ఆమె స్థానంలో అనకాపల్లి జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి పిఒగా నియమితులయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎ.సిరి నియమితులయ్యారు. ఈమె స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

నేటి నుంచి మంత్రి బొత్స పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శని, ఆదివారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం ఎస్.కోటలో, మధ్యాహ్నం మెరకముడిదాంలో వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాల్లో పాల్గొంటారు. 9న గరివిడి మండలం తొండ్రంగిలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్రం భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ జరిగే సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు గుర్ల మండలం పల్లిగండ్రేడులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించి, అనంతరం అక్కడ జరిగే సభలో పాల్గొంటారు.

మళ్లీ పులి కలకలం

ముషిడిపల్లి సమీపంలో ఆవుదూడ మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నాలుగు నెలల క్రితం మండల వాసులను భయపెట్టిన పులి మరోసారి పంజా విసిరింది. మండలంలోని ముషిడిపల్లి గ్రామానికి చెందిన యల్లపు శ్రీరాములుకు చెందిన ఆవు దూడను చంపేసింది. శుక్రవారం తెల్లవారు జామున ముషిడిపల్లి-మధుపాడ మార్గంలోని గోస్తనీ నది తీరంలో శ్రీరాములు పశువుల పాకలో ఉన్న ఆవు దూడపై పులి దాడి చేసి, సమీపంలోని అరటితోటలోకి తీసుకెళ్లి చంపేసింది. సంఘటనా స్థలాన్ని ఆటవీశాఖ డిఆర్ఒ రవికుమార్ పరిశీలించారు. పాదముద్రలను పరిశీలించి, పులిగా నిర్ధారించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ ఇళ్ల వద్ద ఉండాలనీ రోడ్డుపైకి, పొలాల్లోకి రాకూడదని సూచించారు. పులి జాడ కనిపెట్టేందుకు రెండు ట్రాకింగ్ కెమెరాలను ఇక్కడ అమర్చారు. మండలంలో మరోసారి పులివార్త ప్రజలను భయాందోళనలోకి నెట్టేసింది.



చనిపోయిన ఆవుదూడను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డప్పు కళాకారుల సంఘం నాయకులు

10న డప్పు కళాకారుల ధర్నా

ప్రజాశక్తి-గజపతినగరం

జిల్లాలో డప్పు కళాకారులకు పింఛను పెంచాలని, ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు పునరుద్ధరించాలని ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పునరుద్ధరణ చేయాలని కోరుతూ ఈ నెల 10న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని డప్పు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు రాకోటి రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు లింగాల వెంకట్రావు, జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ తెలిపారు. స్థానిక గ్రంథాలయం ఆవరణలో గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అందరికీ పింఛను పెంచి డప్పు కళాకారులకు పింఛను పెంచకపోవడం అన్యాయమని, ఇది దళితులపైన ప్రభుత్వానికి ఉన్న వివక్షతకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్‌లను రద్దుచేసి 29 రకాల సంక్షేమ పథకాలను దళితులకు అందకుండా దూరం చేసిందని అన్నారు. నాలుగేళ్లగా డప్పు కళాకారులకు డప్పులు, గజ్జలు, దస్తులు, చర్మకారులకు కిట్లు పంపిణీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

30లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తు పన్ను చెల్లింపుదారులకు ఐదు శాతం రిబేట్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ అవకాశాన్ని కల్పించినట్లు చెప్పారు. ఆస్తిపన్నుదారులు తక్షణమే పన్ను చెల్లించి ఐదు శాతం రిబేట్ సౌకర్యాన్ని పొందాలని కోరారు. ఇందుకోసం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో కూడా పన్ను చెల్లింపునకు అవకాశం ఉందని పేర్కొన్నారు. సచివాలయాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని చెప్పారు.

ప్రజల్లోకి వెళ్లేందుకు టిడిపికి జంకెందుకు?

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

హామీలన్నీ నెరవేరుస్తూ తాము ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉంటున్నామని, ప్రతిపక్ష పార్టీ అంత ధైర్యంగా జనాల్లోకి వెళ్లేందుకు ఎందుకు జంకుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నిలదీశారు. 'జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నగరంలోని ఒకటో డివిజన్‌లో శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైసిపి పాలనను ప్రజలకు తెలియజేస్తామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను వివరిస్తామని తెలిపారు. సుమారు 11 నెలలుగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి, సంక్షేమ పథకాల లబ్ధిని ఆరా తీస్తున్నామని చెప్పారు. ఇదే సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న సమస్యలను గుర్తించి అప్పటికప్పుడు పరిష్కారం చూపుతున్నా మన్నారు. ప్రస్తుతం చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం.. ప్రజలకు తామంతా మరింత చేరువ కావడానికి దోహదపడుతుందని స్పష్టం చేశారు.

ప్రజల ఆమోదంతో స్టిక్కర్లు అతికిస్తాం..

తమ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను.. గత ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేసేలా కరపత్రాలను ప్రజలకు అందిస్తామని కోలగట్ల తెలిపారు. ఒక బుక్ లెట్‌ను వారికి అందిస్తూ అభిప్రాయాలను తెలుసుకుంటామన్నారు. ఆయా గృహస్తుల ఆమోదంతో, ఆ ఇంటి తలుపు మీద 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికిస్తామని చెప్పారు. దీంతోపాటు సెల్‌ఫోన్ వెనుక అతికించేలా స్టిక్కర్లు అందిస్తామన్నారు. జగన్ పరిపాలనపై ఆమోదం వ్యక్తం చేసిన వారు 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఒక విధంగా ఇది ప్రజాభిప్రాయాలను తెలుసుకొనే సర్వేగా అభివర్ణించారు. ప్రజల్లోకి వెళ్లలేకపోతున్న టిడిపి నాయకులు.. వారి అనుకూల మీడియాను ఉపయోగించుకుని ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. దుష్ప్రచారాలను చేస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాలకు డబ్బులు పంచుతున్నట్లు, రాష్ట్రాన్ని అప్పులు పాలు చేస్తున్నట్లు విమర్శలు చేస్తున్నవారు.. ఆనాడు మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ చేపట్టిన కిలో రూ.2 బియ్యం పథకం, చంద్రబాబు పసుపు- కుంకుమల డబ్బులు ప్రభుత్వ ఖజానావి కావా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు, నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలపై వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

త్వరలో మహిళా పార్కు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

త్వరలో మహిళా పార్కును ప్రారంభించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వెల్లడించారు. రాష్ట్రంలో తొలి మహిళా పార్కుగా ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న మహిళా పార్కు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోవడంతో పార్కును పరిశీలించారు. ఈత కొలనును కూడా పరిశీలించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మహిళలతో సమాలోచనలు జరిపిన అనంతరం మహిళా పార్కు నిర్వహణ కోసం మహిళలే కమిటీగా ఏర్పాటు అయితే మంచిదన్న అభిప్రాయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సూచించారు. పార్క్ లో ఉన్న వ్యాయామశాల, పిల్లలకు క్రీడా సామాగ్రి వంటివి ఏర్పాటు విషయమై వివరిస్తూ ఇంకా అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని మహిళలను ఉద్దేశించి కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతి దేవి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

కాజ్‌వే నిర్మించకుంటే రాజీనామా చేస్తా

వేపాడ వైస్ ఎంపిపి ముత్యాలమ్మ

ప్రజాశక్తి-వేపాడ



కొండగంగుపూడి నుంచి గిరిజన గ్రామాలకు వెళ్లే మార్గంలో గెడ్డ దాటేందుకు కాజ్‌వే నిర్మించకుంటే రాజీనామా చేస్తానని వైస్ ఎంపిపి దాయిరి ముత్యాలమ్మ స్పష్టంచేశారు. శుక్రవారం కొండగంగుబూడిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్న ఆశతో తనను ఎంపిటిసిగా ఎన్నుకున్నారని తెలిపారు. గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. రెండేళ్లు గడిచినా కనీసం గెడ్డ దాటేందుకు కాజ్‌వే నిర్మించలేదన్నారు. పలుమార్లు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపిపి, జెడ్‌పిటిసి దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు వేస్తామని చెప్పినా, నెరవేరలేదని, మట్టిరోడ్డే గతి అన్నారు. గిరిజనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నారే తప్ప పనులు మాత్రం జరగడం లేదన్నారు. దీంతో తనను గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నానని వాపోయారు. తనను ఎన్నుకున్న ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని పదవులు ఎందుకన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు తమ గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, లేకుంటే రాజీనామా చేయక తప్పదని తేల్చిచెప్పారు.

గాలివాన బీభత్సం

ప్రజాశక్తి-వంగర

మండలంలో గురువారం అర్ధరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. తలగాం, మద్దివలస, కొప్పరవలస, బంగారు వలస, తదితర గ్రామాలలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫలితంగా ఆయా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్తు శాఖ ఎఇ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం పనిచేసి, అన్ని గ్రామాలకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. కొద్ది రోజులుగా ప్రతిరోజూ వర్షం కురుస్తుండటంతో మొక్కజొన్న పంటకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



తలగాంలో ఓ ఇంటిపై కూలిన విద్యుత్తు స్తంభం



ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి

నాగావళిలో పెరిగిన నీటి ప్రవాహం

ప్రజాశక్తి-వంగర

మండలంలోని నాగావళి నదిలో శుక్రవారం ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగింది. ఇంతవరకు నదిలో నీరు తక్కువగా ఉండటం వల్ల వంగర, వీరఘట్టం మండలాల ప్రజలు నాగావళిలో రాకపోకలు సాగించేవారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని తోటపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగింది. దీంతో తోటపల్లి గేట్లు ఎత్తి నాగావళి నదిలోకి నీరు విడిచిపెట్టడంతో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు గొంప కృష్ణ

తీరుమారని ముఖ్యమంత్రి : టిడిపి

ప్రజాశక్తి-వేపాడ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయం పాలైనా, సిఎం జగన్ తీరుమారలేదని టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ ఆక్షేపించారు. శుక్రవారం వేపాడలో ఏర్పాటు చేసిన టిడిపి నియోజకవర్గ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే సమయం దగ్గర పడిందన్నారు. అందుకోసం ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులను కోరారు. ఏమైనా సమస్యలుంటే చర్చించి, పరిష్కరించుకుందామని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.


జామిలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు

ప్రజాశక్తి - జామి

జామి సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా వైద్య సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. పిహెచ్సి వైద్యాధికారి భాగ్యరేఖ ఆధ్వర్యాన స్థానిక సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు సూరిదేముడు ప్రారంభించారు. వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ భాగ్యరేఖ మాట్లాడుతూ గ్రామాల్లో 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, గుండె జబ్బుతో బాధపడుతున్న వ్యక్తిని జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

లీకులతో తాగునీరు వృథా

ప్రజాశక్తి-బొబ్బిలి



వృథాగా పోతున్న నీరు

పట్టణంలో లీకులతో తాగునీరు వృథాగా పోతోంది. బలిజిపేట రోడ్డులో ఎక్కడికక్కడే పైపులైన్లు లీకవడంతో తాగునీరు వృథా అవుతోంది. దీంతో పట్టణ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందడం లేదు. పైపులైన్ల లీకేజీలతో బలిజిపేట రోడ్డు, చినబజారు రోడ్డు జలమయమయ్యాయి. లీకులను నివారించి సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పద్మావతినగర్లో సాయిబాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాబాను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు, నాయకులు, నిర్వాహకులు గోల్డ్ శ్రీను, భార్గవ కుమార్, బైక్ రమేష్,గాంధీ, సూరి,లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో పలువురిని ఎమ్మెల్సీ సురేష్బాబు శుక్రవారం పరామర్శించారు. ప్రమాదవశాత్తూ గాయపడి నడవడం కష్టంగా ఉన్న ఎల్దుటి సత్యాన్ని పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు అలమండ అప్పారావు, పల్లా సత్యనారాయణ, కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మిమ్స్లో చికిత్స పొందుతున్న కనకల రాజారావును పరామర్శించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైసిపి నాయకులు నల్లి శ్రీను, తుమ్మ నారాయణమూర్తి, ఉషోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ సురేష్బాబు

అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యత

'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. లోకబందు రెసిడెన్సీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం 5, 6 వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రైతు భరోసా కేంద్రాలకు రూపకల్పన చేసినట్లు చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక టిడిపి, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సావు మురళి, ఎంపిపి శంబంగి లక్ష్మి, వైసిపి పట్టణ, మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, జెసిఎస్ పట్టణ, మండల కన్వీనర్లు ఆర్.విస్సు, ఆర్.దామోదరరావు, నాయకులు పాల్గొన్నారు.

గుర్ల : మండలంలోని పాలవలస, దమరసింగి, భూపాలపురం గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. పాలవలసలో ఎంపిపి పొట్నూరు ప్రమీల, యువ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, దమరసింగిలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు, భూపాలపురంలో జెడ్పిటిసి శీర అప్పలనాయుడు, గోషాడలో జెసిఎస్ మండల కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, సిహెచ్సి మండల కన్వీనర్ మణి ఆధ్వర్యాన నిర్వహించారు. ప్రజా అనుమతితో జగన్ బొమ్మతో ఉన్న స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు బి.శ్రీనివాసరావు, ప్రసాద్, రమేష్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : మండలంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని జెడ్పిటిసి పెద్ది రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గృహ యజమానుల అనుమతితో స్టిక్కర్లు అంటించారు. కోడూరులో వైసిపి నాయకులు తెంటు మధుసూదన్, జెసిఎస్ మండల కన్వీనర్ మరిపి శంకరరావు, పిన్నవలసలో తెంటు తిరుపతినాయుడు, తిరుపతిరావు, రామినాయుడు ఆధ్వర్యాన కార్యక్రమం చేపట్టారు.

దెంకాడ : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మండలంలోని నాతవలస, సింగవరం గ్రామంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పొందిన వారందరూ మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బమ్మిడి వెంకటరమణ, మాజీ సర్పంచ్ అప్పలస్వామి, రామునాయుడు, అప్పారావు, లంక అప్పలనాయుడు, కృష్ణమూర్తి, గురునాథరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మెంటాడ : గత పాలన కన్నా ప్రస్తుత జగన్ పాలనలో సంక్షేమ పథకాలు మెరుగ్గా అందుతున్నాయని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. ఎంపిపి ఛాంబర్లో మండల సచివాలయ కన్వీనర్ కనిమెరక త్రినాథ్ ఆధ్వర్యంలో మా నమ్మకమే జగన్ కార్యక్రమం వారు పరిశీలించారు. ఈ పరిశీలనలో ఇళ్లు మంజూరు కాలేదని పలువురు చెప్పడంతో ఎంపిపి స్పందించి ఇళ్లు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, లెంక రత్నాకర్ నాయుడు, పతివాడ త్రినాథ్, సర్పంచ్ రాయిపిల్లి రామారావు, వైసిపి సీనియర్ నాయకులు పి.అప్పలనాయుడు, బాయి అప్పారావు, దాట్ల హనుమంతురాజు, సిరిశెట్టి నారాయణరావు, పొట్టంగి అచ్చుతరావు, రెడ్డి నారాయణరావు, వర్రి పైడపునాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కుల, మత, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. తద్వారా సంక్షేమ పథకాల అమల్లో మధ్యవర్తులు, అవినీతికి తావులేకుండా ప్రభుత్వం చేసిందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, గిరిజన కార్పొరేషన్ చైర్పర్సన్ శోభా స్వాతిరాణి, ఎఎంసి చైర్పర్సన్ మూకల కస్తూరి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : మూడేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో మేలు చేసిందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో దేశపాత్రునిపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని వైసిపి నాయకులు శుక్రవారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, ప్రభుత్వం వచ్చాక కలిగే మేలును వారికి వివరించారు. ప్రతి గడపకూ వెళ్లి లబ్ధిదారుల తలుపు తట్టి పలుకరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జెసిఎస్ ఇంఛార్జి బొంతుల వెంకటరావు, బొడ్డు అప్పారావు, కొరుబిల్లి స్వామినాయుడు, డి.అప్పన్న, ఏడు వాక నారాయణ, నక్క కృష్ణ, కార్యకర్తలు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని గ్రామాలలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ముమ్ములూరు జగ్గుబాబు, నాయకులు పాల్గొన్నారు.

గజపతినగరం : మెరుగైన ఫలితాల కోసమే ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. శుక్రవారం గజపతినగరంలోని వైసిపి కార్యాలయంలో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమంపై ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొత్స మాట్లాడుతూ గత టిడిపి సర్కారు, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎంత మేరకు నెరవేర్చాయో సరిపోలుస్తూ తెలియజెప్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. 'జగన్ చెప్పాడంటే చేస్తాడంతే' అనే నినాదంతో ఇంటింటికీ వెళ్లి నమ్మకం కలిగించాలని పార్టీలకతీతంగా అందరి యోగక్షేమాలు తెలుసుకొని, భవిష్యత్తులో ఏర్పడే అవసరాలను కూడా తీరుస్తామని చెప్పారు. నియోజకవర్గంలో 90 శాతం మంది గృహసారథులను ప్రత్యక్షంగా కలిశానని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రతి గడప వద్ద తెలియజేయాల్సిన బాధ్యత గృహసారథులదేనిని స్పష్టంచేశారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జెడ్పిటిసి గార తవుడు, మండల నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, పార్టీ అధ్యక్షులు వెంకట్రావు, జెసిఎస్ కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస.. ఇంటి గోడపై స్టిక్కర్ను అంటించిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



బొబ్బిలి.. వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, నాయకులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వెల్లడించారు. శుక్రవారం స్థానిక 1,13 డివిజన్లలో రూ.50.40 లక్షల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. ఒకటో డివిజన్లోని నందిగొడ్డి, సాకేటి వీధి తదితర ప్రాంతాలలో రహదారుల నిర్మాణాలను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రజల నుండి వచ్చిన వినతులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ ప్రజా అవసరాలను తీర్చుతున్నామని గుర్తు చేశారు. శంకుస్థాపనలు చేయడమే కాకుండా ప్రారంభోత్సవాలను కూడా వెనువెంటనే చేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని అన్నారు. అభివృద్ధి పనులు అంటే కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా ఆయా పనులు పూర్తయ్యే విధంగా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తి ప్రస్ఫుటించేలా ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద దండి మార్చ్ విగ్రహావిష్కరణ చేసామన్నారు. ప్రధాన జంక్షన్లను ఇప్పటికే అభివృద్ధి చేసామని తెలిపారు.

దండి మార్చ్ ఏర్పాటుతో నగరంలో గాంధీ మహాత్ముని విగ్రహం ఏర్పాటు కాలేదన్న లోటు తీరిపోయిందని అన్నారు. నగర సుందరీకరణకు, మౌలిక సదుపాయాలు కల్పనకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి ,డిప్యూటీ మేయర్ రేవతి దేవి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్ఛార్జులు ముద్దాడ మధు, దుబే, ముచ్చు శ్రీనివాసరావు, బొద్దాన అప్పారావు, బోడసింగేశ్వర రావు, కార్పొరేటర్ ముచ్చు లయా యాదవ్ వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ ఇఇ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిసిఎంఎస్ టర్నోవర్ లక్ష్యం రూ.21 కోట్లు


చైర్పర్సన్ అవనాపు భావన

ప్రజాశక్తి-బొబ్బిలి



డిసిఎంఎస్ ఆస్తులను పరిశీలిస్తున్న చైర్పర్సన్ భావన

2023-24లో డిసిఎంఎస్ వార్షిక టర్నోవర్ లక్ష్యం రూ.21 కోట్లని చైర్పర్సన్ అవనాపు భావన అన్నారు. బొబ్బిలిలో ఉన్న డిసిఎంఎస్ ఆస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది రూ.19 కోట్లు టర్నోవర్ చేశామన్నారు. ఈ ఏడాది రూ.21 కోట్లకు పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. డిసిఎంఎస్ ద్వారా వివిధ సంస్థలకు, దేవాలయాలకు, విద్యాలయాలకు ఆహార పదార్థాలు అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అవనాపు విక్రమ్, డైరెక్టర్ గొట్టాపు సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిసిసి సభ్యులు ముచ్చల శ్రీనివాసరావు

అదానీపై మోడీకి ఎందుకంత ప్రేమ? : కాంగ్రెస్

ప్రజాశక్తి-బొబ్బిలి

దేశ, విదేశాల్లో అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీపై ప్రధాని మోడీకి ఎందుకంత ప్రేమని పిసిసి సభ్యులు ముచ్చల శ్రీనివాసరావు ప్రశ్నించారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో జై భరత్ సత్యాగ్రహ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీపై దర్యాప్తు చేయడానికి ఎందుకు భయపడుతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్చేశారు. రాహుల్ గాంధీపై వేసిన సస్పెండ్ను వెనక్కి తీసుకోవాలన్నారు. అదానీ కంపెనీలపై జెపిసి వేసి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో లోక్సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ రావు, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, కాంగ్రెస్ నాయకులు వజ్జల శ్రీనివాసరావు, రామకృష్ణ, శివకుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

పేదలకు పౌష్టికాహారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో నవజీవన్ సేవా సంస్థ ఆధ్వర్యాన పేదలకు, వృద్ధులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇన్ఛార్జి అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన దంపతులు శుక్రవారం ప్రారంభించారు. నవజీవన్ సేవా ట్రస్టు ఫౌండర్ కే.శ్రీధర్ ఆచార్య, సాలూరు బ్రాంచి మేనేజర్ చిక్కాల చిన్నమ్మలు లను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఇటువంటి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి, మహిళలకు, అనాథలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, ఐఆర్డిఎస్ అధ్యక్షులు చిక్కాల స్వాతి, స్థానిక ఎస్ఐ పాపారావు, ఆసుపత్రి సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిది కె.ఎం.గౌరీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



పల్లవికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్పి బొత్స ఝాన్సీలక్ష్మి

వెయిట్ లిఫ్టింగ్ కోచింగ్ క్యాంప్కు

సత్యా కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి-విజయనగరం

సత్య డిగ్రీ కళాశాలలో బిఎ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి శనపతి పల్లవి మన రాష్ట్రం తరపున వెయిట్ లిఫ్టింగ్ లో సీనియర్ జాతీయస్థాయి కోచింగ్ క్యాంప్నకు ఎంపికైంది. ఈనెల 4 నుంచి జులై 31వరకు పాటియాలాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్లో ఈ క్యాంపు జరుగుతుంది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పల్లవిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి, కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి అభినందించారు. ఆమె ఫుడ్, ఫిట్నెస్ కోసం డాక్టర్ బొత్స సందీప్ ఆధ్వర్యంలో నడుపుతున్న ధీర ఫౌండేషన్, సత్యా విద్యాసంస్థల తరపున రూ.30 వేల నగదును అందించారు. క్యాంప్ను పూర్తి చేసుకొని ఎన్నో విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పతకాలు సాధించాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న వాకర్స్ నడక మైదానంలో శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎ.కామేశ్వర రావు క్లబ్ సభ్యులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ -102 గవర్నర్ కర్రోతు సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా ఆరోగ్యంపట్ల శ్రద్ధచూపాలని, ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు బిపి, షుగర్ తనిఖీలు చేసుకొని, అవసరమైనవారు మందులు వాడుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ కామేశ్వరరావు కు గవర్నర్ సత్యం, క్లబ్ పెద్దలు సన్మానం చేశారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-బొబ్బిలి

కుటుంబ కలహాలతో టిఆర్ కాలనీకి చెందిన వివాహిత శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తారక రామకాలనీకి చెందిన బి.కుమారి భర్తతో గొడవ పడి పాత బొబ్బిలిలోని ఓ ఆలయం వద్ద పురుగుల మందు తాగింది. వెంటనే గమనించిన స్థానికులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.



అపస్మారక స్థితిలో ఉన్న కుమారి

నేరాలు ఘోరాలు

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - జామి

జామి మండల కేంద్రానికి చెందిన వాక దేముడు (65) శుక్రవారం పురుగుల మందు తాగి మృతి చెందాడు. దేముడు కోడలు శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దేముడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధలు తట్టుకోలేక పురుగుల మందు తాగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-వంగర

మండలంలోని పాత మరువాడ బస్సు షెల్టర్ వద్ద అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి అప్పలనాయుడు 180 మద్యం సీసాలను తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

లారీ ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట



క్షతగాత్రులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ గణేష్

నగరంలోని విటి అగ్రహారం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. విశాఖ నుంచి విజయనగరం వైపు వస్తున్న ఆటోను విటి అగ్రహారం సమీపంలో మామిడికాయల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. కెనరా బ్యాంకు వద్ద కాటాకు వెళ్లేందుకు లారీ ఒక్కసారిగా టర్న్ తీసుకోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు, ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. కొసిరెడ్డి ఎల్లమ్మ, గొర్లి పైడిరాజు, కె. తౌడమ్మ, భరత్రాయ్, డ్రైవర్ నరవ సన్నిబాబుకు తీవ్ర గాయాయ్యాయి. వీరిని స్థానికులు 108కు ఫోన్ చేసి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. రూరల్ సిఐ తిరుపతిరావు, ఎస్ఐ బి.గణేష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరి శీలించారు. ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రాయ్ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్కు తరలించారు.